క్లుప్తంగా

సీసీఐ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నేలకొండపల్లి: ముదిగొండ మండలంలోని సువర్ణాపురం–లక్ష్మీపురం గ్రామాల మధ్య ఉన్న సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఆర్.సంతోష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉషశ్రీ కాటన్ అండ్ జిన్నింగ్ మిల్లులో సోమవారం నుంచి పత్తి కొనుగోలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్వింటాకు రూ.7,020 మద్దతు ధరను చెల్లించనున్నట్లు తెలిపారు. సీసీఐ వారు ప్రకటించిన తేమ 8 శాతం నుంచి 12 శాతం వరకు ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకెళ్లాలని సూచించారు.

దుస్తులు వితరణ



దుస్తులు తీసుకెళ్తున్న ఫౌండేషన్ బాధ్యులు

కూసుమంచి: పాలేరు గ్రామానికి చెందిన యువత మేలుకో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నం ఫౌండేషన్‌కు దుస్తులు అందజేశారు. ఆర్గనైజేషన్ సభ్యులు గ్రామంలో వాడవాడలా తిరిగి పాత దుస్తులను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు శీలం రామకృష్ణ, సభ్యులు బత్తుల వీరబాబు, గోపె కార్తీక్, బొంకూరి నాగార్జున్, గణేష్, మహేష్, గోపి, సంతోష్ పాల్గొన్నారు.

9న తమ్మినేని నామినేషన్

నేలకొండపల్లి: పాలేరు సీపీఎం అభ్యర్థిగా ఈ నెల9న తమ్మినేని వీరభద్రం నామినేషన్ వేయనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ తెలిపారు. మండలంలోని ఆరెగూడెంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు... నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మున్నూరుకాపు సంఘం పట్టణ అధ్యక్షుడిగా సత్యనారాయణ



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నేలకొండపల్లి: మున్నూరుకాపు సంఘం పట్టణ అధ్యక్షుడిగా కందికొండ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంఘం సమావేశంలో పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గుండా బ్రహ్మం, ప్రధాన కార్యదర్శిగా బ్రహ్మారపు ఉదయ్‌భాస్కర్, సహాయ కార్యదర్శిగా తోట నరసింహారావు, కోశాధికారిగా తోట భాను, కమిటీ సభ్యులుగా ఏనుగుల శ్రీను, చిట్టింశెట్టి వెంకటేశ్వర్లు, కందికొండ సాయి వితేష్, చిట్టింశెట్టి ఉదయ్‌భాస్కర్, పట్టణ యూత్ అధ్యక్షుడిగా మర్రిశివలన ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు మారిశెట్టి వెంకటేశ్వరరావు, కనపర్తి నాగేంద్రరావు, మానుకొండ దుర్గారావు, బాజా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	లియో
వినోద	భగవంత్ కేసరి
సాయిరాం	కీడా కోలా
ఆదిత్య	మా ఊరి పొలిమేర 2
శ్రీనివాస	టైగర్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	46		20
కాకర	26	చుక్కకూర	3
బోడ కాకర	90		20
బీర	40	తోటకూర	2
దొండ	20		10
పొట్లకాయ	36	గోంగూర	3
చిక్కుడు	66		10
గోరుచిక్కుడు	36	మెంతికూర	3
క్యాబేజీ	18		10
క్యాలీఫ్లవర్	20	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		20
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	38		20
క్యాప్సికం	36	-ఖమ్మం వ్యవసాయం	

ఖమ్మం.. గులాబీమయం!

ప్రజా ఆశీర్వాద సభకు భారీగా తరలివచ్చిన జనం
- గ్యాలరీలు నిండడంతో వీఐపీ గ్యాలరీల్లోకి కార్యకర్తలు
- కార్యకర్తలను గ్యాలరీలో కూర్చోపెట్టిన మంత్రి అజయ్



పాటలు పాడుతూ నృత్యం చేస్తున్న కళాకారులు





సభకు హాజరైన జనం, బీఆర్ఎస్ శ్రేణులు



కేసీఆర్ చేతికి ఇమామ్ జామీ కడుతున్న ముస్లింలు



సభా వేదికపైకి వస్తున్న మంత్రి పువ్వాడ



పాటపాడుతున్న మంత్రి పువ్వాడ



యువతి సంబురం



ఉపాధి కల్పించాలనే ప్లకార్డుతో ఉద్యమకారుడు

ఖమ్మంమయూరిసెంటర్/రఘునాథపాలెం: ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఖమ్మంను గులాబీ గుబాళింపుతో ముంచెత్తింది. రాష్ట్ర మంత్రి, ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌ను గెలిపించాలని నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన సభకు సీఎం కేసీఆర్ హాజరై పువ్వాడను గెలిపించాలంటూ పార్టీ శ్రేణులకు, నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సభలో పాల్గొనేందుకు కొత్తగూడెం సభ అనంతరం హెలికాప్టర్ ద్వారా ఖమ్మం చేరుకున్న సీఎం కేసీఆర్‌కు పారీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ స్వాగతం పలికారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సభా ప్రాంగణంలో తిరుగుతూ సభకు వచ్చిన కార్యకర్తలకు అభివాదం చేస్తూ, అందరిని పలకరిస్తూ, ముందు వరుసలో ఉన్న గ్యాలరీల్లోకి పంపించారు.

భారీగా తరలివచ్చిన శ్రేణులు..

సభకు నియోజకవర్గం వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సభకు వచ్చే కార్యకర్తలు, జనంను తరలించేందుకు ఆ పార్టీ నాయకులు ఆర్టీసీ, స్కూల్ బస్సులు, ఆటోలు, డీసీఎంలు, లారీలను ఏర్పాటు చేశారు. రఘునాథపాలెం మండలంలోని 37 గ్రామ పంచాయతీల నుండి 117 బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు ద్వారా వేల మందిని తరలించారు. ఖమ్మంలో సీఎం కేసీఆర్ సభ ఉండడంతో వైరా, మధిర నియోజకవర్గాల నుండి కేసీఆర్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

మధ్యాహ్నం ఒంటి గంట నుండే..

సభలో పాల్గొనేందుకు బీఆర్ఎస్ శ్రేణులు మధ్యాహ్నం ఒంటి గంట నుండే సభా ప్రాంగణానికి చేరుకోవడం మొదలైంది. కళాశాల మైదానానికి బైపాస్ వైపు ఉన్న రెండు గేట్ల నుంచి కార్యకర్తలను పోలీసులు తనిఖీచేసి లోపలికి అనుమతించారు. పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో గ్యాలరీలు నిండిపోయాయి. ప్రజలు సభకు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో వేదికపై ఉన్న కార్పొరేటర్లు, ఎమ్మెల్సీ తాత మధు, రఘునాథపాలెం ప్రజాప్రతినిధులు కిందికి వచ్చి గ్యాలరీల్లోకి పంపించి కుర్చీల్లో కూర్చోబెట్టారు. ఒక్కసారిగా జనం పోటెత్తడంతో పోలీసులను, వలంటీర్‌లను సమన్వయం చేస్తూ ప్రజలు ఇబ్బంది పడకుండా చూశారు. వెనుక ఉన్న గ్యాలరీలన్నీ నిండడంతో వీఐపీ గ్యాలరీల్లోకి అనుమతించి అక్కడ కూర్చోబెట్టారు. కార్యకర్తలకు మజ్జిగ ప్యాకెట్లు, మంచినీటి ప్యాకెట్లను వలంటీర్‌ల ద్వారా అందజేశారు.

మంత్రి పువ్వాడ ఆటా పాట

అదేవిధంగా ఆశీర్వాద సభలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆట పాటతో ప్రజలను అలరించారు. ఉద్యమకారుల పాట 'వీరుల్లారా.. వీర వనితల్లారా' అనే పాటను మంత్రి ఆలపించారు. ధూం..ధాం బృందంతో కలిసి గళం కలిపారు. నృత్యంచేస్తూ గులాబీ కండువాను చేత్తో ఊపుతూ కార్యకర్తల్లో జోష్ నింపారు.

సీపీఎం అభ్యర్థి బయోడేటా



నియోజకవర్గం : ఖమ్మం
పేరు : యర్రా శ్రీకాంత్
స్వస్థలం : ఖమ్మం
భార్యాపిల్లలు : సుకన్య (ఐద్వా నాయకురాలు), రంజిత్, స్రవంత్, జ్ఞానేష్
విద్యార్హత : ఇంటర్
పార్టీలో ప్రస్తుత హోదా : సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు
రాజకీయ ప్రస్థానం : శ్రీకాంత్ 1980లో సీపీఎంలో చేరారు. 1982 నుంచి 84 వరకు ఎస్ఎఫ్ఐలో పని చేశారు. 1991 నుంచి సీపీఎం పూర్తి కాలం కార్యకర్తగా కొనసాగుతున్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



మల్లిక

ఖమ్మంరూరల్: కల్లూరులో జరిగిన ఖమ్మం జిల్లా సబ్ జూనియర్ బాలికల ఖోఖో పోటీల్లో మండలంలోని వెంకటగిరి ఉన్నతపాఠశాల విద్యార్థిని దగ్గుబాటి మల్లిక ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. మెదక్ జిల్లా తొంపురంలో నవంబర్ 15, 16, 17 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈ మేరకు మల్లికను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాలువాయి వెంకటేశ్వరరావు, పీఈటీ బి. రాజకుమారి ఉపాధ్యాయులు అభినందించారు.



వర్ష

కూసుమంచి: త్వరలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని చేగొమ్మ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని కే.వర్ష ఎంపికయింది. కల్లూరులో జరిగిన జిల్లా ఖోఖో అసోసియేషన్ సబ్ జూనియర్స్ కేటగిరిలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాగా ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ, పీఈటీ కవిత అభినందించారు.

కరాటేతో ఆత్మరక్షణ..



బహుమతులు అందజేస్తున్న సుమన్

ఖమ్మం స్పోర్ట్స్: మహిళలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాల్సిన అవసరం ప్రస్తుతం పరిస్థితిలో ఉందని, కరాటేతో రక్షణ ఉంటుందని సినీ నటుడు సుమన్ అన్నారు. నగరంలోని వర్తక సంఘం భవన్‌లో ఆదివారం జాతీయ కరాటే పోటీలు జరిగగా విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం సాధించిన వారు ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. అనంతరం వివిధ కేటగిరిల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించి అభినందించారు.

జనసేనకు మూకుమ్మడి రాజీనామా



మాట్లాడుతున్న సూరజ్ కిరణ్

నేలకొండపల్లి: జనసేన పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు చేయటానికి సిద్ధమైన్నట్లు పార్టీ పాలేరు డివిజన్ కో–ఆర్డినేటర్ సూరజ్ కిరణ్ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.. పాలేరులో పార్టీ పోటీ చేయకపోవటంతో కార్యకర్తలు అంతా అసంతృప్తితో ఉన్నట్లు తెలిపారు. డివిజన్‌లోని అన్ని శాఖల ప్రతినిధులతో చర్చించి త్వరలోనే రాజీనామాలు చేస్తామన్నారు. త్వరలోనే భవిష్యత్ కార్యచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు. అనంతరం పార్టీ క్రియాశీలక సభ్యత్వం కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మామిడి ఉదయ్‌కుమార్, తుమ్మలపూడి గంగాధర్, భూక్యా రాజేంద్రప్రసాద్, పల్లి వెంకటేష్, ఆనంద్, నాగరాజు, బద్రి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



యుద్ధభేరికి వెళ్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: వచ్చే పార్లమెంట్ సామావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. హైదారాబాద్‌లో ఇందిరాపార్కు వద్ద నిర్వహించే మాదిగల యుద్ధభేరి సభకు ఆదివారం ఖమ్మం బైపాస్ నుండి భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తానని ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పేర్ల మధు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, నాగమణి, వెంకన్న, నాగేశ్వరరావు, కనకరత్నం, భద్రయ్య, జానీ, రవి, భిక్షం, వెంకటేశ్వర్లు, ఏసోబు, మాతంగి శ్రీను, రాజశేఖర్, నరసింహ, రవిబాబు, నాగరాజు, సునిత పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ వైష్ణవ సేవా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగరంలోని పీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సామూహిక సుదర్శన హోమం, శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. సంఘం ఏర్పాటై 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా శ్రీ వైష్ణవ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శేషభట్టర్ రఘునాథాచార్యులు, కొదమసింహం రవికిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘ అధ్యక్షులు ఎస్టీ చారి, ప్రధాన కార్యదర్శి సేనాపతి మోహన్, ఎస్సీహెచ్ రామకృష్ణాచార్యులు, జిల్లాకు చెందిన ప్రతినిధులు రామకృష్ణాచార్యులు, భార్గవాచార్యులు, ఫణికుమార్, శేషభట్టర్ పవన్‌కుమార్, ఓలేటి శ్రీనివాసా చార్యులు, కండ్లకుంట రవికిరణ్, పాండురంగాచార్యులు, నాగులవంచ రమణ తదితరులు పాల్గొన్నారు. శ్రీనివాస కల్యాణ కార్యక్రమంలో నకిరకంటి సతీష్, పుల్లఖండం శ్రీకాంత్, నోముల వెంకటేశ్వర్లు, కొణిజర్ల హనుమంతరావుల తో పాటు శిరం కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అందరినీ ఐక్యం చేసేదే కాంగ్రెస్..

- ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్/ ఖమ్మం అర్బన్: దేశాన్ని ఐక్యం చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీనేనని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నగరంలో తుమ్మల మిత్ర మండలి, శ్రీలక్ష్మీ గాయత్రి, హరివిల్లు, పంపింగ్ వెల్ రోడ్డులో చర్చిలో, ఎస్ఆర్ కన్వెన్షన్‌లో పాలేరు నియోజకవర్గ బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తలతో, 28, 29వ డివిజన్లలో, 14,15 డివిజన్ల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో ఆత్మీయ సమ్మేళనాలలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాయ మాటలతో ఈ ప్రభుత్వం ఇన్నాళ్లు కొనసాగుతూ వస్తుందన్నారు. జిల్లాలో జెండా పట్టే దిక్కులేనప్పుడు నన్ను, పొంగులేటిని చేర్చుకున్నారని, ఇప్పుడు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. సోషల్‌మీడియాలో వ్యతిరేక పోస్టు పెట్టిన సామినేని సాయిగణేష్‌ను కేసులతో వేధించి అతని ఆత్మహత్యకు కారకులయ్యారన్నారు. ఖమ్మం నగరంలో మనషులకు, వారి ఆస్తులకు రక్షణ లేదని, ఖాళీ ప్లాటు కనబడితే కబ్జా చేసే పరిస్థితుల నెలకొన్నాయన్నారు. న్యాయం కోసం ఎదురు తిరిగితే కేసులు పెట్టి వేధించడం, మాట వినని వాళ్ల మీద భౌతిక దాడులు చేయడం నిత్య కృత్యంగా మారిందన్నారు.

టీడీపీ మద్దతు కోరిన తుమ్మల...

ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని తుమ్మల నాగేశ్వరరావు టీడీపీ నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఖమ్మంలోని టీడీపీ కార్యాలయంలో నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం తదితరులను కలిసి మద్దతు కోరారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావేద్, మానుకొండ రాధాకిషోర్, యేర్నేని రామారావు, నాగండ్ల దీపక్‌చౌదరి, రావూరి కరుణా సైదుబాబు, మేకల మల్లిబాబు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, కమర్తపు మురళీ, మిక్కిలినేని నరేందర్, సాధు రమేష్‌రెడ్డి, వనం మణికంత, కెతినేని హరీశ్, కూచిపూడి, బైరు అప్పారావు, ఒడ్డురి బాబు, చల్లగుల్ల జ్యోతిబసు, కన్నేటి పృథ్వీ, రేమల్ల వెంకన్న, శెట్టి రంగారావు, పాదిలి రవి కుమార్, యనిగండ్ల సత్యనారాయణ, నాగేశ్వరరావు, మల్లేశ్వరరావు, బొమ్మిశెట్టి సత్యనారాయణ, శ్రీనివాసరావు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కందాళ గెలుపు కోరుతూ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న దీప్తి

కూసుమంచి: పాలేరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి గెలుపు కోరుతూ ఆయన కుమార్తె దీపిక ఆదివారం పాలేరు గ్రామంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సహాయ సహకారాలు అందించి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేసిన కందాళను మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

ఓటర్లకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఓటరు చైతన్య రథం ద్వారా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందాలు ఓటర్లలో తమ ఆట పాటల ద్వారా చైతన్యం కల్గిస్తున్నారు. ఆదివారం లకారం ట్యాంక్‌బండ్ వద్ద సాంస్కృతిక సారథి కళాకారులు ఓటు విలువ, ఓటు హక్కు ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని పాటలు, నాటిక ద్వారా ప్రజలకు వివరించారు. ఓటు హక్కు సామాన్యుని చేతిలో వజ్రాయుధంలాంటిదని, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఓటు వేయాలని ప్రజలకు పాటలతో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సుధాకర్, ముత్తయ్యలు ప్రదర్శనలు ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిక



తిరుమలాయపాలెం : పొంగులేటి సమక్షంలో పార్టీలో చేరుతున్న వంశీకృష్ణ, కనకయ్య

తిరుమలాయపాలెం: మండల వైస్ ఎంపీపీ బుద్దా వంశీకృష్ణ, ప్రముఖ వ్యాపారవేత్త బుద్దా కనకయ్య పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం మండలంలోని బీరోలు, బంధంపల్లి గ్రామాలకు చెందిన నాయకులు ఎస్.కె. జాన్ బాబు, మల్లయ్య, చాగంటి వెంకన్న, ఉపేందర్ సహా పలు కుటుంబాలు పార్టీ రాష్ట్ర నాయకురాలు మద్దినేని బేబీ స్వర్ణ కుమారి, నాయకులు చావా శివరామకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. వీరికి పొంగులేటి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రసాదరెడ్డి సమక్షంలో ...

మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన వివిధ పార్టీల నుండి పలు కుటుంబాలు కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి సమక్షంలో సాయిగణేష్ నగర్ క్యాంపు కార్యాలయంలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: పాలేరులో పొంగులేటి శ్రీనివాసడ్డి గెలుపును ఏ శక్తి అడ్డుకోలేదని కాంగ్రెస్ నాయకులు మైశా శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని 259 పోలింగ్ బూత్‌లో ఆదివారం ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఓటర్లను కలిసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టనున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... నిరుద్యోగులు, యువత, విద్యార్థులకు తీరని అన్యాయం చేసిన బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, గోరెంట్ల చంటి, అనంతు సత్యనారాయణ, రాంబాబు, పొన్నగాని రాంభాస్కర్, టి. బ్రహ్మం, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న మల్లిబాబుయాదవ్, తదితరులు

కూసుమంచి: ఈ నెల 8న కూసుమంచి నిర్వహించనున్న పాలేరు నియోజకవర్గ యాదవ, కురుమల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ కోరారు. ఆదివారం కూసుమంచిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బంగారు తెలంగాణా తీసుకొచ్చి కులవృత్తులను ప్రోత్సహిస్తానన్న సీఎం కేసీఆర్ మాయ మాటలతో కాలం వెళ్లదీశారన్నారు. గొల్ల,కురుమలకు గొర్రెలు ఇస్తానని డీడీలు కట్టించుకుని నేటి వరకు గొర్రెలు ఇవ్వకుండా కేసీఆర్ మోసం చేశారన్నారు. ఈ సమావేశంలో వెంకటరమణ, కృష్ణ, వీరభద్రం, వెంకటేష్, ప్రవీణ్, సురేష్, నవీన్, లింగయ్య, శ్రీనివాసరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.